# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-10-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **విజయవాడ ఖ్యాతి దేశవ్యాప్తంగా చాటేలా "విజయవాడ ఉత్సవ్ 2.0" ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.**

3. **ఆంధ్రప్రదేశ్ తీరప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.**

4. **ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్ పంటలకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన విద్యుత్తు సరఫరా అందిస్తున్నామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. విజయవాడ ఉత్సవ్, సరస్ మేళా ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా సందర్భంగా వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. విజయవాడ ఉత్సవ్-2.0ను, పున్నమి ఘాట్‌లో రేపటి నుంచి జరిగే జాతీయ సరస్ మేళాను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర పర్యటన ఏర్పాట్లను అన్ని శాఖల సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు.

కాగా.. సమీక్షలో పాల్గొన్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సరస్ మేళాపై పాత్రికేయులతో మాట్లాడుతూ...

..వాయిస్..30 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు నగరంలో సర్వేపల్లి కట్ట ప్రాంతంలో నివాసితులకు ఇళ్ల పట్టాల పంపిణీని

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి క్యాంపు కార్యాలయం నుంచి దృశ్య మాధ్యమ విధానంలో నిన్న ప్రారంభించారు. దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేదలకు శాశ్వత భద్రత కల్పించామని ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేపట్టిన మూడు రోజుల స్పెయిన్ పర్యటన ముగిసింది. స్పెయిన్‌లోని సెవిల్లె నగరంలో జరిగిన 'టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్-2026'లో మంత్రి పాల్గొని, రాష్ట్ర పర్యాటక అవకాశాలను అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భారతదేశాన్ని ఇప్పటికే సందర్శించామని భావించే వారు ఒక్కసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి చూడాలని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రముఖ ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

-------------------------

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆశ్వయుజ శుద్ధ విదియ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు ఈరోజు గాయత్రీదేవి రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు.

మరో వైపు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈరోజు నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమెయ్యాయ. ఇందులో భాగంగా నిన్న సాయంత్రం అంకురార్పణ నిర్వహించారు. శ్రీశైల క్షేత్రంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నిన్న వైభవంగా ప్రారంభమయ్యాయి. భ్రమరాంబాదేవి శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

అలాగే తెలంగాణలో నిర్వహిస్తున్న బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా ఈరోజు ముద్దపప్పు బతుకమ్మను నిర్వహిస్తున్నారు.

-------------------------

దసరా ఉత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో "విజయవాడ ఉత్సవ్ 2.0" వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్‌తో కలిసి నిన్న సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, విజయవాడ ఖ్యాతి దేశవ్యాప్తంగా చాటేలా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాల్లో స్థానిక కళాకారులకు ప్రాధాన్యమిచ్చామని కేంద్రమంత్రి తెలియజేస్తూ...

వాయిస్ ..30.. సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్ తీరప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం తోకతిప్ప వద్ద అప్రోచ్ రోడ్ల నిర్మాణం కోసం ఏర్పాటు చేస్తున్న యనమదుర్రు కాలువపై వంతెనలకు కేంద్ర మంత్రి నిన్న

శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసవర్మ మాట్లాడుతూ, అధికారులతో సమన్వయం చేసుకుంటూ వంతెనల అప్రోచ్ రోడ్ల నిర్మాణాన్ని మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ రహదారుల నిర్మాణంతో యనమదుర్రు కాలువకు ఇరువైపులా రవాణా సదుపాయాలు మెరుగుపడనున్నాయని తెలిపారు.

---------------------------

ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్ పంటలకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన విద్యుత్తు సరఫరా అందిస్తున్నామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా జుజ్జుల రావుపేటలో తాగునీటి పథకం ట్యాంకు నిర్మాణానికి, మంగలి తండాలో పంచాయతీ భవనాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్తు, తాగునీటి సమస్యలు అధికమవుతున్నాయని, వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు రెండో పంట సాగు చేయకుండా ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే సాగులో ఉన్న పంటల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్ నిన్న పర్యటించారు. ఈ సందర్భంగా రేపల్లె మండలంలో మొత్తం 144 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, పూర్తయిన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన పనులకు శ్రీకారం చుట్టారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని మంత్రులు ఈ సందర్భంగా తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలపై దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా కోస్తా ఆంధ్రా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు.

మరోవైపు తెలంగాణలో ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

శ్రీశైలం ఎడమ కాలువ సొరంగ మార్గం పనులను 2028 జూన్ నాటికి పూర్తి చేసి, ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని తెలంగాణ రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా కనగల్ మండలంలోని గ్రామాల్లో 74 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న రహదారుల విస్తరణ పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తేలకంటిగూడెం నుంచి తౌరగల్ జంగమాయిగూడెం మీదుగా ముషంపల్లి వరకు.. అలాగే చెట్లచెన్నారం నుంచి చిన్నమాదారం, తంగెళ్లవారిగూడెం మీదుగా ముషంపల్లి వరకు రహదారుల విస్తరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రహదారుల అభివృద్ధితో పరిశ్రమల స్థాపనకు అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

=====================